# దురాక్రమణ యుద్ధ ఊబిలో అమెరికా ఆఫ్ఘన్ విధానం

**'ఆఫ్ఘనిస్తాన్‌పై** 16 సంవత్సరాలుగా యుద్ధం సాగిస్తున్నా, అమెరికా ఎందుకు విజయం సాధించలేక పోయింద'ని ఆఫ్ఘనిస్తాన్‌పై 16 సం॥ల సైనిక దురాక్రమణ యుద్ధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద ప్రశ్నను లేవనెత్తాడు.

అమెరికా ప్రజలు, అదేవిధంగా ప్రపంచ ప్రజలు 2001 సెప్టెంబర్ 11వ తేదీని మరచిపోలేరు. ఆరోజున, అమెరికాలోని ప్రపంచ వాణిజ్య కేంద్ర ప్రధాన కార్యాలయాలపైనా, పెంటగాన్ స్థావరాలపైనా విధ్వంసక సైనికదాడులు జరిగాయి. అందులో పెద్దఎత్తున ఆస్థి, ప్రాణనష్టం సంభవించింది. వీటన్నిటికి మించి, ప్రపంచ అగ్రశక్తిగా అమెరికా సామ్రాజ్యవాదం యొక్క ప్రతిష్ట ఓ తీవ్ర కుదుపుకు గురైంది. ఈ చర్యకు కారకులెవరనేది ఈనాటికీ నిగూఢంగానే వుంది. అయినప్పటికీ, ఆఫ్ఘనిస్తాన్ కేంద్రంగా వున్న 'టెర్రరిస్టులే' ఈ దాడికి కారకులని అమెరికా సామ్రాజ్యవాదులు దాడులు జరిగిన వెనువెంటనే ఆరోపించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా ప్రపంచస్థాయి యుద్ధంగా పిలువబడే దానిని ప్రకటించటానికి ఈ దాడులను సాకుగా ఉపయోగించుకున్నారు. అమెరికా ప్రయోజనాలకు ప్రమాదకారిగా వున్న లేదా ప్రమాదకారిగా అనుమానించబడుతున్న టెర్రరిస్టులకు సహాయం అందిస్తున్న లేదా సహాయ మందిస్తున్నట్లుగా పరిగణించ బడుతున్న ఏ దేశంపైనైనా, లేదా ఏప్రాంతంపైనైనా నిరపేక్ష దాడిచేసే హక్కు అమెరికాకు వుందని నాటి అమెరికా దేశాధ్యక్షుడు జార్జి డబ్ల్యు.బుష్ పేర్కొన్నాడు. టెర్రరిజానికి వ్యతిరేకంగా తన ప్రపంచస్థాయి యుద్ధంలో భాగంగా అమెరికా బలగాలతోపాటు నాటో బలగాలు 2001 అక్టోబర్ 7న ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం ప్రారంభించాయి. ఏమైనా, 'టెర్రరిజంపై పోరు' పేరున అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధం-ఆఫ్ఘనిస్తాన్‌పై సైనిక దురాక్రమణకు పాల్పడి, దానిని ఆక్రమించు కోవటంకోసం మినహా వేరు కాదు.

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత కాలంలో, అమెరికా అధ్యక్షులలో డొనాల్డ్ ట్రంప్ మూడవవానిగా వున్నాడు. ఆశ్చర్యకరంగా, సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ ఈ యుద్ధం అమెరికా సామ్రాజ్యవాదులకు మరింత, మరింత క్లిష్టంగా మారుతోంది. దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా ఆఫ్ఘన్ ప్రజలు పోరాటం సాగిస్తున్నారు. సామ్రాజ్యవాదులు ఆఫ్ఘనిస్తాన్‌లోని తమ సైనిక బలగాలను 2002లో 7,425 నుండి 2006 నాటికి 23,300కు పెంచుతూ వచ్చారు. 2009లో అధికారంలోకి రాబోయే ముందు ఈ యుద్ధాన్ని ముగించటాన్ని గురించి ఒబామా చాలా చెప్పాడు. కానీ, అధికార పీఠాన్ని అధిరోహించిన తర్వాత, 'ఈ యుద్ధం అవసరమైనదం'టూ వక్కాణించటం ప్రారంభించాడు. ఆఫ్ఘనిస్తాన్‌లోని సైనిక బలగాల సంఖ్యను 2009 డిసెంబర్‌లో 69,000 నుండి 2011 మే నాటికి 1,00,000కు పెంచాడు. అమెరికా సేనల దాడులలో 1,75,000 మంది ఆఫ్ఘన్ ప్రజలు మరణించి వుంటారనేది తక్కువలో తక్కువ అంచనా. ఈ యుద్ధం కోసం అమెరికా 80,000 కోట్ల డాలర్లను ఖర్చుచేసినట్లు చెపుతున్నారు. 2003 మార్చిలో అమెరికా సామ్రాజ్యవాదులు మరో తప్పుడు సాకుతో ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధం సాగించి దానిని ఆక్రమించారు. అక్కడ కూడా వారికి శక్తివంతమైన ప్రజాప్రతిఘటన ఎదురైంది.

2008 నాటి తీవ్ర ఆర్థికసంక్షోభం ఫలితంగా ప్రజలనుండి ఎదురైన శక్తివంతమైన ప్రతిఘటన; అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ ప్రజల పోరాటాలకు మద్దతుగా ప్రపంచవ్యాపిత ప్రజా సమీకరణలతో అమెరికా తన ఎత్తుగడలలో కొన్ని మార్పులు చేసుకోవలసివచ్చింది. 2014లో 'ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్' ముగింపుగా పిలవబడే ఓ ప్రకటనతో అమెరికా ముందుకొచ్చింది. 2014 డిసెంబర్ 28న 'ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సైనిక బలగాల ఉపసంహరణ' జరుగుతున్నట్లుగా ప్రకటించారు. చర్చల క్రమంద్వారా తాలిబన్లలో కొన్ని సెక్షన్లను తమవైపు రాబట్టుకునే ప్రయత్నాలను అమెరికా ముమ్మరం చేసింది. ఆఫ్ఘన్ ప్రజలను అణచివేసే ఆఫ్ఘన్ రక్షణ బలగాలకు 'సలహా, శిక్షణ, సహాయం' సమకూర్చేందుకు 'ఆపరేషన్ రిజల్యూట్' పేరున తమ సైనికబలగాలలో మేలైన సైనికులను అమెరికా (8,400 మందిని), నాటో (5,000మందిని) ఆఫ్ఘనిస్తాన్ లోనే వుంచాయి.

అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం గురించిన తన విమర్శలో డొనాల్డ్ ట్రంప్ గట్టిగా అరచి కేకలు వేశాడు. ఈ యుద్ధంలో అమెరికా కోట్లాది డాలర్ల ధనాన్ని వృధా చేస్తున్నదని, ఆఫ్ఘన్ ప్రజల చేతుల్లో అమెరికా సైనికులు మరణిస్తున్నారని ఆయన పేర్కొన్నాడు. కనుక, ఈ యుద్ధానికి ముగింపు పలకాలని ఆయన పిలుపునిచ్చాడు. అయితే అధికారంలోకి రాగానే, ట్రంప్ స్వరం మార్చాడు. అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై విజయం సాధించలేక పోవటానికి కారణం-అమెరికా దురాక్రమణ పూర్తిగా న్యాయ సమ్మతమైనదేనా?, ఈ యుద్ధాన్ని అమెరికా ఎందుకు గెలవలేదు?, ఆఫ్ఘనిస్తాన్ నుండి పూర్తిగా బయటపడటానికి తీసుకోవలసిన చర్యలేమిటి? వంటి ప్రశ్నలపై దృష్టి సారించలేకపోవటమేనని ట్రంప్ పేర్కొంటున్నాడు.

అయితే, 'మేము గెలుస్తాం' అనే హామీతో ట్రంప్ ముందుకొచ్చాడు. కనుక తనకంటే ముందు పాలించిన వారివలెనే, యుద్ధాన్ని ముగించటానికి సానుకూలంగా వున్నట్లు పోజుతో, అమెరికా యొక్క యుద్ధ, దురాక్రమణ విధానానికి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజానిరసన వెల్లువపై నీళ్ళు చల్లటానికి, ప్రజలలో భ్రమలను పెంచటానికి పూనుకున్నాడు. వారి తక్షణ ప్రయోజనం నెరవేరిన తర్వాత, బడావ్యాపార వర్గాలైన-యుద్ధ పరిశ్రమల నిజమైన ప్రతినిధిగా ట్రంప్ తన వికృత సామ్రాజ్యవాద ముఖాన్ని ప్రదర్శించటానికి ఏ మాత్రం తటపటాయించదు.

2017 ఆగస్టు 21న, ఆఫ్ఘన్ సంక్షోభ పరిష్కార కోసమంటూ 'దక్షిణాసియా వ్యూహం'పేరుతో ఓ 'నూతన విధానాన్ని' ట్రంప్ ప్రకటించాడు. ఈ సంక్షోభం ఈ విధంగా వ్యక్తమౌతూ వుంది–

1. ఆఫ్ఘనిస్తాన్‌లో సామ్రాజ్యవాదులు పెంచి పోషిస్తూ, పరిరక్షిస్తున్న ప్రభుత్వమొకటి వుంది. అయితే, ఇది పూర్తిగా ఆఫ్ఘన్ ప్రజలనుండి వేరుపడి వుంది.
2. ప్రస్తుతం, సగానికి పైగా ఆఫ్ఘన్ భూభాగాలపై, ప్రజలపై తాలిబన్లు అదుపు కలిగివున్నారు. తమ అదుపులోనున్న ప్రాంతాలను విస్తరించుకునే ప్రయత్నాలను సాగిస్తున్నారు. అంతిమంగా ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యంతో నున్నారు. అమెరికా రక్షణలోనున్న ఆఫ్ఘన్ ప్రభుత్వం, తనలో పెరుగుతోన్న అధికార కుమ్ము లాటలతో చీలికలకు గురైవుండటంతోపాటు, తాలిబన్ల దాడులను ఎదుర్కోవటంలో బలహీనంగా వుండి వణికి పోతున్నది.
3. తాలిబన్లను సైనికశక్తితో మాత్రమే తుడిచి పెట్టలేమని, సంప్రదింపులు, చర్చల క్రమాన్ని దీనితో జోడించి తీరాలని అమెరికా సామ్రాజ్యవాదులు నిర్ధారణకొచ్చినట్లుగా కన్పడుతున్నది.
4. గత అనేక దశాబ్దాలుగా, ఆసియా ఖండంలో అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహాత్మక లక్ష్యాల సాధనలోను, ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లపై యుద్ధంలోను, పాకిస్థాన్ పాలకులు అమెరికా సామ్రాజ్యవాదులకు మంచి నమ్మకమైన, ఆధారపడదగిన మిత్రులుగా సేవలంది స్తున్నారు. ఏమైనా, చైనాతో పాకిస్థాన్‌కు పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ, సైనిక ఒప్పందాలు, అమెరికా పాలకుల కలతకు కారణంగా వున్నాయి. గత కొంతకాలంగా, పాకిస్థాన్‌లోని తాలిబన్ల స్థావరాలపై దాడుల లోనూ, పాకిస్థాన్ భూభాగంపై నుండి తాలిబన్లకు వ్యతిరేకంగా సాగించే యుద్ధం విషయంలో పాకిస్థాన్ పాలకులు తగినంత నిక్కచ్చిగా వ్యవహరించటంలేదని అమెరికా భావించటమేకాక, తన ఆందోళనను వ్యక్తం చేస్తోంది కూడా. తాలిబన్లతో వ్యవహ రించటంలో, ఈ పరిస్థితి తమను ఇబ్బందికర పరిస్థితికి నెడుతుందని అమెరికా పాలకులు భావిస్తున్నారు.

అమెరికా ప్రకటించిన 'నూతన దక్షిణాసియా వ్యూహం'గా పిలవబడేది కూడా, అమెరికా ప్రత్యక్షంగా, శక్తివంతంగా తన సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేసేందుకు ఉద్దేశించినదే. తాలిబన్ల పోరాడే బృందాన్ని లేదా నాయకత్వ బృందాన్ని తుడిచిపెట్టే విధంగా లేదా క్రియారహిత శక్తిగా కుదించివేసే విధంగా గట్టి దెబ్బకొట్టాలని అమెరికా కోరుకుంటున్నది. తాలిబన్ల స్థావరాలపట్ల పాకిస్థాన్ నిక్కచ్చిగా వ్యవహరించే విధంగా; అమెరికాకు మరియు అమెరికా ప్రాపకంలోని ఆఫ్ఘన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాలిబన్లు పోరాడకుండా, పోరాటపంథాను విడనాడే విధంగా పాకిస్థాన్ ప్రభుత్వం తన పరపతితో వారిని ఒప్పించే విధంగా–పాకిస్థాన్ పాలకులపై ఒత్తిడి పెంచాలని అమెరికా చూస్తోంది. "టెర్రరిస్టు సంస్థలకు రక్షణ స్థావరాలను కల్పించటంపట్ల అమెరికా ఇంకెంత మాత్రమూ మౌనంగా వుండబోదు", "టెర్రరిస్టులు ఎక్కడ నివశిస్తున్నా, మేము వారిపై దాడిచేయబోతున్నాం" అనే అమెరికా పాలకుల హెచ్చరికలు; 'నూతన అమెరికా వ్యూహం' వంటి ప్రకటనలన్నీ, పాకిస్థాన్‌పై తగినంత ఒత్తిడిని పెంచి, ఆ పాలకుల ప్రవర్తనలో తమ కనుకూలమైన మార్పును రాబట్టుకునే ప్రయత్నాలలో భాగమే.

అమెరికా పాలకులు వివరించినట్లుగా, తాలిబన్లపై ఒత్తిడిని పెంచి, వారిని చర్చలకు వచ్చేట్లు చేయటమే నూతన అమెరికా విధానంగా వుంది. అమెరికా రక్షణశాఖామంత్రి, అమెరికా వాదనను ఈ విధంగా పేర్కొంటున్నాడు: "ఒక్కోసారి యుద్ధరంగంలోనే నీవు విజయం సాధించలేవు. నీవు ఒక్కరిని కూడా, నిన్ను కూడా గెలుచుకోలేకపోవచ్చు. కనుక, ఒక దగ్గరకు, చర్చించుకునే బల్లవద్దకు మనం వచ్చి, దీనికి ఒక ముగింపు పలికే మార్గాన్ని కనుగొనాలి". ఇక్కడ, ఒకవిధంగా, ఆఫ్ఘనిస్తాన్‌కు వ్యతిరేకంగా 16 సం॥ల పాటు సాగించిన అన్యాయ యుద్ధం తర్వాత, అమెరికా పాలకులు తమను తాము ఎంతటి అనిశ్చిత పరిస్థితిలో వుంచుకున్నారనే దానిని అంగీకరిస్తున్నారు. అదే సమయంలో, తాలిబన్లను చర్చలక్రమంలోకి లాగి, వారి మెడపై కత్తిపెట్టి, అమెరికా సామ్రాజ్యవాదులు ఆదేశించిన విధంగా ఒప్పందంపై సంతకం చేయించాలనే వారి ప్రయత్నాన్ని ఇది తెలుపుతోంది.

ఈ నూతన వ్యూహం ఆఫ్ఘనిస్తాన్‌లో భారతదేశపు జోక్యాన్ని మరింత లోతుగా జొప్పించాలని చూస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌కు 'అత్యంత విశ్వసనీయ ప్రాంతీయ భాగస్వామి'గా భారతదేశాన్ని పేర్కొంటూ అమెరికా కీర్తించింది. అమెరికా నాయకత్వంలోని అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల వ్యూహాత్మక కూటమిలో భారతదేశం ఒక భాగస్వామి అవటంకూడా దీనికి కారణం కావచ్చు. ఆసియా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంపై అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారతదేశాన్ని ఈ ఒప్పందం కట్టివేస్తున్నది. కనుక, అమెరికా సామ్రాజ్యవాదులు ఆఫ్ఘనిస్తాన్‌లో భారత పాలకులకు అప్పగించే ఏ పాత్ర అయినా, ఆఫ్ఘన్ ప్రజానీకంతోనూ, మరియు ఆసియా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని ఇతర దేశాలతోనూ శత్రుత్వాన్ని మరింత పెంచు తుందనేది నిస్సందేహం. ఆఫ్ఘనిస్తాన్‌లో పెరిగే భారతదేశ జోక్యం–భారత, పాకిస్థాన్ దేశాలమధ్య వైరుధ్యాలను, ఉద్రిక్తతలను మరింతగా పెంచుతుంది. కనుక, 'నూతన అమెరికా వ్యూహం' ప్రమాదకర పర్యవసానాలను కల్గిస్తుందనేది స్పష్టం.

గత అమెరికా విధానాలు సాధించలేని లక్ష్యాలను, 'నూతన అమెరికా వ్యూహం' కూడా సాధించలేదు. ఆఫ్ఘన్ సంక్షోభాన్ని మరింత పొడిగించి, తీవ్రం చేయటమే దీని ఉద్దేశ్యం. ఆఫ్ఘన్ ప్రజల స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు సంబంధించిన వారి హక్కును పూర్తిగా పునరుద్ధరించటం, ఎవరి జోక్యం లేకుండా, స్వీయ ఆకాంక్షల కనుగుణంగా ఆఫ్ఘన్ ప్రజలు తమ భవిష్యత్తును తామే స్వేచ్ఛగా రూపొందించుకోవటం ద్వారానే–ఆఫ్ఘన్ సమస్యకు శాశ్వతమైన, నమ్మకమైన పరిష్కారం సాధ్యమౌతుంది.

oooooo